

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 230 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం, 20, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# దేశంలో.. కొత్తధర్మం!







- హుండీలకు గండి కొడుతున్నారు
- ధర్మాన్ని దారికీడుస్తున్నారు
- దైవ సొమ్మును దొంగిలిస్తున్నారు
- మహిళ రేపిస్టులకు మర్యాదలు చేస్తున్నారు
- కులాలను కించపరుస్తున్నారు
- మతాలను మంట కలుపుతున్నారు
- దేశ సంపదపై దాడి చేస్తున్నారు
- ఇస్రో శాస్త్రవేత్తలను ఆగం చేస్తున్నారు
- ఉద్యమకారుల ఉసురు పోసుకుంటున్నారు
- విద్యార్థుల జీవం తీస్తున్నారు
- పేదవాడి పొట్ట కొడుతున్నారు ని
- ఉన్నోళ్ల దౌర్జన్యాలకు ఊడిగం చేస్తున్నారు
- డాక్టర్ బరిగెల శివ

దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థ, మత సామరస్యంపై తీవ్ర దాడులు జరుగుతున్నాయని జై భీమ్ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. ఆలయ హుండీల నిధుల దుర్వినియోగం నుంచి ఈవీఎంలు, పరీక్షా పత్రాల లీకులు, నిరుద్యోగం, మహిళల భద్రత, శాస్త్రవేత్తల రాజీనామాలు వరకు అనేక అంశాల్లో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని అన్నారు. దేశ సంపద, రాజ్యాంగ సంస్థలు, ప్రజల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. దేశాన్ని రాజ్యాంగబద్ధ విలువలతో నడిపించేందుకు మేధావులు, యువత, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)










## గాంధీభవన్‌కు రావొద్దు!

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ కఠిన ఆదేశాలు

ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలోనే పనిచేయాలని స్పష్టీకరణ

గైర్హాజరైతే కఠిన చర్యలు.. ఛైర్మన్ పదవులు కూడా ఉండవు

బీఎల్‌వోలతో పాటు బీఎల్‌ఏల నివేదికలకు ప్రాధాన్యం

ఉత్తమ 100 మంది బీఎల్‌ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం



2

## ఒమన్‌లో మహిళ అవస్థలు

ఉద్యోగం పేరుతో మస్కట్‌కు వెళ్లిన హైదరాబాద్ మహిళకు చేదు అనుభవం

రోజుకు 15 గంటలు పని.. నాలుగు నెలలుగా జీతం లేదని ఆరోపణ

భారత రాయబార కార్యాలయంలో ఆశ్రయం పొందిన షబ్నమ్ బేగం

క్షేమంగా స్వదేశానికి రప్పించాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

రిక్రూట్‌మెంట్ ఏజెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



4

## తిరుమలలో గదుల కేటాయింపుకు కొత్త విధానం

సీఆర్వోలో రిజిస్ట్రేషన్.. ఉప విచారణ కార్యాలయాల్లో గదుల కేటాయింపు

డిస్‌ప్లే బోర్డులు, ఎస్ఎంఎస్‌ల ద్వారా భక్తులకు సమాచారం

ఆన్‌లైన్ చెల్లింపుతోనే గది తాళాల అందజేత

గదుల వినియోగం, ఖాళీపై కఠిన నిబంధనలు అమలు

సామాన్య భక్తుల ఇబ్బందులకు చెక్ చెప్పిన టీటీడీ



2

## ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)



సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల ఆరోపణలు వెలుగుచూశాయి. తనతో పాటు శిక్షణ పొందుతున్న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత అధికారిణి ఫిర్యాదు ప్రకారం, నిందితుడు తనను బలవంతంగా గదిలోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, తన వ్యక్తిగత వీడియోలను అనుమతి లేకుండా చిత్రీకరించాడని ఆరోపించారు. అనంతరం ఆ వీడియోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ తనను బ్లాక్‌మెయిల్ చేశాడని, ఆ వీడియోలను తన భర్తకు పంపించి తీవ్ర మానసిక వేదనకు గురిచేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌తో పాటు సమాచార సాంకేతిక చట్టంలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ అనంతరం వాస్తవాలు వెల్లడికానున్నాయి. కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ ఆరోపణలు ఫిర్యాదు ఆధారంగానే పరిగణించాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# గాంధీభవన్‌కు రావొద్దు!

**ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ కఠిన ఆదేశాలు**
**ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలోనే పనిచేయాలని స్పష్టీకరణ**
**గైర్హాజరైతే కఠిన చర్యలు.. ఛైర్మన్ పదవులు కూడా ఉండవు**
**బీఎల్‌వోలతో పాటు బీఎల్‌ఏల నివేదికలకు ప్రాధాన్యం**
**ఉత్తమ 100 మంది బీఎల్‌ఏలకు రాహుల్ గాంధీని కలిసే అవకాశం**

**హైదరాబాద్, జులై 19 (జై భీమ్ న్యూస్) :**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 3 వరకు గాంధీభవన్‌కు రావొద్దని, పూర్తిగా క్షేత్రస్థాయిలోనే ఉండి ప్రజల మధ్య పనిచేయాలని సూచించారు. ఎస్ఐఆర్ సమీక్ష సమావేశాలకు గైర్హాజరయ్యే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన సీఎం, కార్యక్రమంలో చురుకుగా పనిచేయని వారికి ఛైర్మన్ పదవులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఇన్‌చార్జి మంత్రులు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించాలని, జులై 30న నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే పది రోజుల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ ఇన్‌చార్జీలు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. బీఎల్‌వోల నివేదికలకే పరిమితం కాకుండా బీఎల్‌ఏల నివేదికలను కూడా పరిగణనలోకి తీసుకుని బూత్ స్థాయి కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. అత్యుత్తమంగా పనిచేసిన 100 మంది బీఎల్‌ఏలకు రాహుల్ గాంధీని కలిసి ఫొటో దిగే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటివరకు 489 ఎస్ఐఆర్ సమావేశాలు నిర్వహించామని వెల్లడించిన సీఎం, ఆగస్టు 3 వరకు పొడిగించిన గడువును పూర్తిగా వినియోగించుకుని ప్రజల్లో మరింత విస్తృతంగా చేరుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ఇథనాల్‌పై నరేశ్ ట్వీట్

**ఈ20 పెట్రోల్‌పై కేంద్ర ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించిన సీనియర్ నటుడు**
**ఇంజిన్లు దెబ్బతింటున్నాయంటూ ఆందోళన వ్యక్తం**
**స్నేహితుడి కారుకు రూ.3.5 లక్షల మరమ్మతుల ఖర్చు వచ్చిందని వెల్లడి**
**తాను హై-ఆక్టేన్ పెట్రోల్ వినియోగిస్తున్నానని వివరణ**
**బ్రెజిల్ తరహాలో దశలవారీ అమలు చేయాల్సిందని సూచన**



**హైదరాబాద్, జులై 19 (జై భీమ్ న్యూస్) :**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఈ20) విధానంపై టాలీవుడ్ సీనియర్ నటుడు నరేశ్ సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల సామాన్యుల నుంచి ఖరీదైన కార్లు వినియోగించే వారి వరకు అందరూ నష్టపోతున్నారని, వాహనాల ఇంజిన్లపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. తాను దేశ వ్యతిరేకిని కాదని స్పష్టం చేసిన ఆయన, ప్రభుత్వం తీసుకొచ్చిన ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ విధానం బైక్‌ల నుంచి లగ్జరీ కార్ల వరకు వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. బీజేపీకి మద్దతుదారుడైన తన స్నేహితుడు ఇటీవల కొనుగోలు చేసిన టయోటా క్యామ్రీ కారులో ఇథనాల్ పెట్రోల్ వాడటం వల్ల ఇంజిన్ వాల్వులు దెబ్బతిన్నాయని, వాటిని మార్చేందుకు రూ.3.5 లక్షలు ఖర్చయ్యాయని వెల్లడించారు. ఇదే పరిస్థితి తన కొత్త పోర్షే పనమెరా కారుకు వస్తే సుమారు రూ.12 లక్షల వరకు వ్యయం అవుతుందని, అందుకే ప్రస్తుతం లీటరు రూ.165 ధర ఉన్న హై-ఆక్టేన్ 100 పెట్రోల్‌ను వినియోగిస్తున్నానని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యం మంచిదేనని, అయితే కోట్లాది మంది ప్రజలపై ఆర్థిక భారం పడేలా ఈ నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. బ్రెజిల్ వంటి దేశాలు ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని దశలవారీగా అమలు చేశాయని గుర్తుచేస్తూ, భారత్‌లో కూడా అదే విధానాన్ని అనుసరించాల్సిందని సూచించారు. ఈ20 విధానం ఎన్నికల ముందు బీజేపీకి రెడ్ సిగ్నల్‌గా మారే అవకాశం ఉందని పేర్కొంటూ, ఇదే తన ఆందోళన అని నరేశ్ ట్వీట్‌లో వెల్లడించారు.

## తిరుమలలో గదుల కేటాయింపుకు కొత్త విధానం

**తిరుమల, జూలై 19 (జై భీమ్ న్యూస్) :**

శ్రీవారి దర్శనానికి తిరుమలకు వచ్చే భక్తులు వసతి గదుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా టీటీడీ నూతన గదుల కేటాయింపు విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ విధానంలో ముందుగా భక్తులు ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి సీఆర్వో కార్యాలయంలో ఒరిజినల్ ఆధార్ లేదా జిరాక్స్ కాపీ, మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకుని ఫేస్ రికగ్నిషన్ ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలి. అనంతరం రూ.50, రూ.100 గదులు ఉన్న 'ఏ' కేటగిరీ లేదా రూ.1000 గదులు ఉన్న 'బీ' కేటగిరీని ఎంపిక చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత అక్నాలెడ్జ్‌మెంట్ స్లిప్ అందజేస్తారు. గదుల కేటాయింపు వివరాలను సీఆర్వోలోని డిజిటల్ డిస్‌ప్లే బోర్డులపై ప్రదర్శించడంతో పాటు, 15 నిమిషాల్లో భక్తుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. ఎస్ఎంఎస్ అందకపోతే కియోస్క్‌లో స్లిప్ స్కాన్ చేసి కేటాయించిన ఉప విచారణ కార్యాలయ వివరాలు తెలుసుకోవచ్చు. అనంతరం సంబంధిత ఉప విచారణ కార్యాలయానికి వెళ్లి ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఐ లేదా డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి గది తాళాలు పొందాలి. నగదు చెల్లింపులకు అవకాశం ఉండదు. అంజనాద్రి, శేషాద్రి, శంఖుమిట్ట, గరుడాద్రి నగర్ కాటేజీలు, సుదర్శన, గోవర్ధన్, కల్యాణి సత్రాలు, సప్తగిరి, రామ్ భగీచా, వరాహస్వామి, కౌస్తుభం, పాంచజన్యం, నందకం విశ్రాంతి గృహాల్లో ఈ విధానం అమల్లో ఉంటుంది. గది పొందేందుకు భక్తుడికి 21 సంవత్సరాలు నిండి ఉండాలని, ఒంటరి వ్యక్తులు, అవివాహితులకు గదులు కేటాయించబోమని టీటీడీ స్పష్టం చేసింది. ఒకసారి గది పొందిన వ్యక్తికి మరో 30 రోజుల వరకు తిరిగి గది ఇవ్వరు. కుటుంబం నుంచి ఒకరే రిజిస్ట్రేషన్ చేయాలి. గదులు 24 గంటలపాటు మాత్రమే కేటాయిస్తారు. గడువు దాటితే 200 శాతం, 48 గంటలు దాటితే 400 శాతం అదనపు రుసుము వసూలు చేస్తారు. గదిని పొందిన భక్తుడే స్వయంగా ఖాళీ చేయాల్సి ఉంటుందని, లేనిపక్షంలో కాషన్ డిపాజిట్ తిరిగి ఇవ్వబోమని, గదిని ఇతరులకు బదిలీ చేయడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ వెల్లడించింది.

# దేశంలో కొత్త ధర్మం.!

**ధర్మాన్ని దారికీడుస్తున్నారు.**
**దైవ సొమ్మును దొంగిలిస్తున్నారు.**
**మహిళ రేపిస్టులకు మర్యాదలు చేస్తున్నారు.**
**కులాలను కించపరుస్తున్నారు.**
**మతాలను మంట కలుపుతున్నారు.**
**దేశ సంపదపై దాడి చేస్తున్నారు.**
**ఇస్రో శాస్త్రవేత్తలను ఆగం చేస్తున్నారు.**
**ఉద్యమకారుల ఉసురు పోసుకుంటున్నారు.**
**విద్యార్థుల జీవం తీస్తున్నారు.**
**పేదవాడి పొట్ట కొడుతున్నారు.**
**ఉన్నోళ్ల దౌర్జన్యాలకు ఊడిగం చేస్తున్నారు.**
**డాక్టర్ బరిగెల శివ.**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

దేశంలో జరుగుతున్న పరిస్థితులను అంచనా వేయడం అసాధ్యమైపోతుందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.బరితెగించినోనిదే రాజ్యం అంటూ అవినీతి సామ్రాజ్యాలను స్థాపించడం కోసం రాజకీయ శక్తులుగా ఎదుగుతూ అత్యంత దుర్భలంగా దైవ హుండీలలోని సొమ్మును గండి కొడుతున్నారని ఆరోపించారు.ఒకప్పుడు రాజకీయాలకు మతాలకు మధ్య ఎంతో విభేదం ఉండేదని రాజకీయాల్లో మతాలను వాడితే చట్టాలను న్యాయస్థానాలను ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన వాళ్లుగా పరిగణలోనికి తీసుకొని కఠినమైన కేసులు కట్టే వాళ్ళని అలాంటి పరిస్థితుల్లో నుండి మతాలను ఉచ్చరించకుండా రాజకీయాలు చేయలేమనే స్థితిలోనికి దేశ రాజకీయాలను మార్చుకున్నారని తీవ్రంగా విమర్శించారు.దేశం ఎంతలా అభివృద్ధి చెందుతుంది అంటే దేశ ప్రజలు నిద్రిస్తున్న సమయంలో పశ్చిమ బెంగాల్లో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ లో జరిగిన ఉదాంతం దేశ సమగ్రతను నామరూపం లేకుండా చేసిందని 4 వేల ఈవీఎంలు రాత్రికి రాత్రే కాల్చివేయడం దానిని షార్ట్ సర్క్యూట్ గా ప్రచారం చేయడం అత్యున్నత న్యాయస్థానంలో జరుగుతున్న కేసులకు ఆధారాలు లేకుండా చేసిందని ఎంతో విలువతో కూడిన ఆధారాలను అంత సునాయాసంగా నాశనం చేయడంలో దిట్టగా మారిపోతున్న బిజెపి ప్రభుత్వం దేశాన్ని అన్ని విధాలా నాశనం చేస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఇస్రోలో ఏం జరిగిందో బయటపడడం లేదు గాని ఉన్నపాటుగా సుమారు 120 మంది శాస్త్రవేత్తలు పరిశోధన చేయలేమంటూ బయటకు రావడం ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురి చేస్తుందని ఆరోపించారు. గుజరాత్,బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్,ఆంధ్రప్రదేశ్, ఇలాంటి ప్రధాన రాష్ట్రాలు దేశ సంపదపై దాడి చేస్తున్నాయని దేశ ప్రజల సంపదను దేశ ప్రజల ఉనికిని పూర్తిగా గండి కొడుతున్నారని క్షేత్రస్థాయిలో ఆరోపించారు.దేశంలో జరుగుతున్నటువంటి ఎన్నికల కోసం ఇప్పటివరకు 60 లక్షల ఈవీఎంలు కొనుగోలు చేసినట్లు విశ్వాసనీయ సమాచారంగా భావిస్తూ ఉంటుండగా అందులో 20 లక్షల ఈవీఎంల జాడ ఇప్పటివరకు కనిపించడం లేదంటూ మేధావుల ఆరోపణలకు ప్రతిపక్షాల సూటి ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం నుండి సమాధానం దొరకడం లేదంటూ సూటిగా నిలదీశారు.రాజకీయ నాయకుల వ్యాపారాలలో పెట్టుబడుల వాటా క్షేత్రస్థాయిలో పెరిగిపోతుందని విదేశీ పెట్టుబడులతో పాటు జాతీయ పెట్టుబడులన్నీ రాజకీయ పలుకుబడగలిగిన వ్యక్తుల కంపెనీలకు మాత్రమే చేరవేయబడుతూ కేవలం అలాంటి వాళ్లకు మాత్రమే అవకాశాలు కల్పింపజేస్తూ సామాన్య వ్యాపారాలు సాధన వ్యాపారాలు దేశ పరిధిలో ఆయా రాష్ట్రాల పరిధిలో పరిగణలోనికి రాకుండా పోయే పరిస్థితులు ఎదురవుతున్నాయన్నాయని వాటన్నిటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.దేశంలో ప్రజాస్వామ్యవాదులపై భారత రాజ్యాంగ రక్షణదారులపై తీవ్రమైన దాడులు పెరిగిపోతున్నాయని అదే సందర్భంలో మహిళలపై రేపిస్టు దాడులకు పాల్పడుతూ జైల్లో జీవిత ఖైదులు అనుభవిస్తున్న నేరస్తులకు మధ్యంతర బెయిల్స్ తో పాటు సన్మానాలు గౌరవాలు దక్కుతున్నాయన్నారు.దేశ పాలనను ప్రశ్నిస్తున్న పుణ్యాన వేల మంది నిరుద్యోగ యువకులు వేల మంది ప్రజాస్వామ్యవాదులు నేటికి జైల్లోనే మరుగుతున్నారని ఇది కూడా దేశంలో ఒక కొత్త రకమైన అణిచివేత ధర్మంగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నట్లు దేశ ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారని గుర్తు చేశారు.

**దేశం గొంతు నొక్కుతున్న నియంతలు..**

కర్ణాటక ఆర్ఎస్ఎస్ నాయకుడు రామ్ మహదేవ్ పాకిస్తాన్ కు చెందిన ప్రధానవ్యక్తులతోపాటు ఐఎస్ఐ అధికారులతో నాలుగు రహస్య సమావేశాలు నిర్వహించినట్లు సోషల్ మీడియా వేదిక వెల్లడిస్తుండగా బికె హరిప్రసాద్ దాన్ని బహిర్గతం చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి విచారణగానీ వాటికి సంబంధించిన ఆధారాలు గాని కేంద్ర ప్రభుత్వ నిఘా విభాగాలు బయట పెట్టలేకపోవడం దేశద్రోహం లాంటిది అన్నారు.నీట్ పరీక్ష పత్రం లీక్ అవడంతో 19 మంది విద్యార్థులు అకారణంగా చనిపోవడం పట్ల కేంద్ర మంత్రులు ఏ ఒక్కరు స్పందించకపోవడం దేశ రక్షణకు దేశ ఔన్నత్యానికి పూర్తి విరుద్ధమన్నారు.గత ఐదు సంవత్సరాల కాలంలో 42 కు పైగా పలు రకాల ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడం స్వతంత్ర భారతదేశంలో చెప్పుకోలేని ఘోరం అన్నారు.భారతదేశంలోని భాగమైనటువంటి మణిపూర్ లాంటి ప్రాంతం మూడు సంవత్సరాలుగా అల్లర్లతో కాలిపోతూ ఉంటే దేశాన్ని పాలిస్తున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు అటువైపు కనీసం కన్నెత్తి చూడకపోవడం రెండు తెగల మధ్య చిచ్చురేపి వాళ్లకు వాళ్లే చంపుకునే విధంగా చేసే ప్రయత్నంలో తీవ్రమైన అల్లర్లను రేపుతున్నట్లుగా దేశ పాలనకు అద్దం పట్టినట్లుగా స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు.దేశంలోని బిజెపి ప్రభుత్వం 12 సంవత్సరాలుగా ప్రవేశపెడుతున్న బడ్జెట్లోని ఆర్థిక వ్యయాన్ని పెద్ద ఎత్తున కాలరాస్తున్నప్పటికీ ఏ ఒక్కరూ స్పందించడం లేదన్నారు దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగ వ్యవస్థపై దేశంలో సంక్షేమానికి విరుద్ధంగా నడుస్తున్న ఆర్థిక వ్యవస్థపై, దేశంలో రక్షణ లేకుండా మతాల పేరు చెబుతూ పేద ప్రజలను అకారణంగా చంపుతున్న విధానాల పట్ల,దేశంలో విద్యా వ్యవస్థ నాశనం అవుతున్న తీరును నిరసిస్తూ,దేశంలో ప్రధాన ఆలయాల ట్రస్టుల్లో ఉన్నటువంటి నిధులను దొంగిలిస్తున్నటువంటి విధానాల పట్ల,దేశ ఆర్థిక వ్యవస్థను కేవలం బిజెపి అనుబంధ సంస్థలకు చెందిన 50 మంది వ్యక్తులకు లక్షల కోట్ల రూపాయల కట్టబెడుతూ జరుగుతున్న ఆర్థిక దోపిడి పట్ల దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు ధర్నాలు రాష్ట్రరోకోలు ఆమరణ నిరాహార దీక్షలు కేంద్ర ప్రభుత్వాన్ని కంటికి నిద్ర లేకుండా చేస్తుండగా సోనం వాంగ్చుక్ గౌహతిలో చేపట్టిన 18 రోజుల ఆమర నిరాహార దీక్ష దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లోని మేధావులందరినీ మేధోమధనంతో ఆలోచింప చేసిందని ఆయన తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్షకు సంబంధించిన డిమాండ్ల పట్ల కేంద్ర ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వస్తుందని భావిస్తున్న దేశ ప్రజలకు ఒక్కసారిగా నిరాశ మిగిలిందని పైగా కేంద్ర అధికార ప్రభుత్వం పోలీసులచే ధర్నాను ఆమరణ నిరాహార దీక్షను భగ్నం చేసి కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుని అభిజిత్ దీప్కే పై సిరా ఇంకుతో దాడికి పాల్పడి ఆమరణ దీక్ష చేపట్టిన సోనంను బలవంతంగా లాక్కెళ్లారని ఇది దేశ ప్రజాస్వామ్య, సామ్రాజ్యంపై జరిగిన ఘోరమైన,క్రూరమైన దాడిగా వివరించారు.దేశంలో ఎక్కడ చూసినా ప్రధాన ఆలయాల్లో హుండీల సొమ్ముకు గండికోడుతూ దొంగిలిస్తున్నప్పటికిని దైవభక్తిని చాటుకుంటూ ఎన్నికల్లో పాల్గొంటున్న ప్రధాన నేతలందరూ దేవుని సొమ్మును దొంగిలించడం పట్ల దేవుళ్ళ సొమ్ముపై దాడి చేయడం పట్ల దైవ హుండీలకు గండి కొడుతుండడం పట్ల పశ్చాత్తాప పడాల్సింది పోయి బహిరంగంగా సందేశాలిస్తూ ఆలయాల సొమ్మును దోచుకుంటే తప్పేందంటూ నిసిగ్గుగా మాట్లాడడం మనుషులలోని మానవ మృగాలను బయటపెడుతున్నట్లుగా ఉందని హెచ్చరించారు.దేశం మొత్తం ఆలయ దొంగతనాలను విమర్శిస్తుంటే కేంద్ర ప్రభుత్వం అయోధ్య రామాలయంలోని దొంగతనంతో పాటు బద్రీనాథ్ ఇతర ప్రధాన ఆలయాల దొంగతనాలను, ట్రస్టులకు సంబంధించిన నిధులను దొంగిలించడం పట్ల,కొన్నిచోట్ల రాజకీయ ఎన్నికలకు వాడుకోవడం గమనిస్తుండగా వాళ్ల స్వయంకృతాపరాదాలను సవరించుకోకుండా సంకోచం లేకుండా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తాం ఎవరు మాట్లాడకూడదు ఎవరు ప్రశ్నించకూడదు ఎవరు అభ్యంతరాలు తెలుపకూడదు ఎవరు సంకోచింపకూడదు ఎవరు కేంద్ర ప్రభుత్వానికి ఎదురుగా మాట్లాడకూడదు అనే విధంగా బలవంతపు దాడులను చేస్తూ ప్రజాస్వామ్యవాదులపై కొనసాగిస్తున్న రాజకీయ ఒత్తిల్లను, అణిచివేత బత్తిల్లను,అడ్డు,అదుపు లేకుండా చేయడం పట్ల దేశ ప్రజల నోరు మూయించడం కోసం నియంతల సామ్రాజ్యాన్ని స్థాపించుకుంటూ దేశ ఉనికిని దేశ సమగ్రతను దేశ భవిష్యత్తును నాశనం చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు.అన్నింటికన్నా ప్రధానంగా మతాలపై దాడులు చేయడం వంటి ప్రక్రియలను కేంద్ర ప్రభుత్వం నిరంతరంగా కొనసాగిస్తుందని 2014 నుండి నేటి వరకు మూడుసార్లు ఎన్నికల మేనిఫెస్టోను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్క మేనిఫెస్టోలో మతాలపై మతసామ్రాస్యాలపై ప్రస్తావించింది లేనప్పటికిని నేడు కొనసాగించబడుతున్న బిజెపి పాలన పూర్తిగా మతాల చుట్టే పరిభ్రమిస్తూ దేశ పాలన సాగుతున్నట్లుగా ప్రతి రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లు ప్రస్ఫుటంగా తెలియజేస్తున్నాయన్నారు.దేశ ప్రజల ఉనికిపై చావు దెబ్బ కొడుతున్న కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు అందరూ దేశానికి చేస్తున్న అన్యాయాన్ని మనస్సాక్షిగా ఒప్పుకొని తీరాలని ఇకనైనా దేశ ప్రజలపై రాజకీయ నాయకుల బరితెగింపు తనాలకు మానుకోవాలని వాటి కోసం ప్రయాస పడకూడదని హెచ్చరించారు. అన్ని విధాలుగా తీవ్ర నష్టంలో మునిగిపోయిన భారతదేశాన్ని ఎలా రక్షిస్తారో తెలియదు కానీ దేశంలో ప్రధానమైన ధర్మాలుగా అనాదికాలం నుండి దేశ ప్రజలు గౌరవించుకునే భారత రాజ్యాంగం, భారత న్యాయస్థానం,భారత చట్టం,భారత ప్రజాస్వామ్యం,లకు నిజాయితీగల ధర్మమైన మార్గంలో కొనసాగించకుండా వాటికి విరుద్ధంగా,అధర్మ పూరితమైన విధానాలను రాజ్యాంగ విరుద్ధమైన పరిపాలనను కొనసాగిస్తూ దేశాన్ని శాసిస్తున్నారని మొత్తం మీదుగా దేశంలో కొత్త రకమైన అరాచక ధర్మాలు పెరిగిపోతున్నాయని వాటిని నియంత్రించడం కోసం దేశాన్ని రక్షించుకోవడం కోసం మేధావులు యువత ప్రతిపక్షాలు న్యాయస్థానాలు చట్టాలు ఐక్యంగా ఉద్యమించాల్సిన తరుణం ఏర్పడిందని దేశంలోని ప్రతి వర్గాన్ని ఆయత్తపరిచారు.

# ప్రతిభకు గుర్తింపు..
# నెమ్మది రిత్విక్‌కు బ్రౌన్ అండ్ బ్లాక్ బెల్ట్

**మౌలాలిలో ఘనంగా కరాటే బెల్ట్ పరీక్షలు**
**ముఖ్య అతిథిగా ఉప్పల్ జోన్ అదనపు డీసీపీ ఎన్. వెంకటరమణ**
**వంద మంది విద్యార్థుల పాల్గొనికతో విజయవంతమైన బెల్ట్ పరీక్షలు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్..**

కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోకన్ ఇండియా ఆధ్వర్యంలో గణేష్ మాస్టర్ నిర్వహణలో మౌలాలిలో కరాటే బెల్ట్ పరీక్షలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ జోన్ అదనపు డీసీపీ ఎన్. వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై బెల్ట్ పరీక్షలను ప్రారంభించి విద్యార్థులను అభినందించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు వంద మంది కరాటే విద్యార్థులు, కరాటే మాస్టర్లు, శిక్షకులు ఈ బెల్ట్ పరీక్షల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించిన పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. మాస్టర్ శివ శిక్షణలో క్రమశిక్షణతో సాధన చేస్తున్న నెమ్మది రిత్విక్ బెల్ట్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బ్రౌన్ అండ్ బ్లాక్ బెల్ట్ సాధించాడు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ ఎన్. వెంకటరమణ చేతుల మీదుగా రిత్విక్‌కు బ్రౌన్ అండ్ బ్లాక్ బెల్ట్‌తో పాటు ధ్రువపత్రాన్ని అందజేసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎన్. వెంకటరమణ మాట్లాడుతూ, కరాటే విద్య విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలను పెంపొందించడంతో పాటు ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. గణేష్ మాస్టర్ మాట్లాడుతూ, నిరంతర సాధన, పట్టుదల, క్రమశిక్షణతోనే ఉన్నత విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. మాస్టర్ శివ మాట్లాడుతూ, నెమ్మది రిత్విక్ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కరాటే మాస్టర్లు, శిక్షకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






# స్వచ్ఛ ఇంద్ర హిల్స్ కార్యక్రమం నిర్వహించిన ప్రెసిడెంట్ వెంకట్ నాయక్





**కూకట్ పల్లి (జై భీమ్ న్యూస్)**

ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ లోని ఇంద్ర హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం స్వచ్ఛ ఇంద్రహిల్స్ అనే కార్యక్రమం ప్రారంభమైంది. స్వచ్ఛ ఇంద్ర హిల్స్ కార్యక్రమంలో భాగంగా చెట్లు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఎసి చైర్మన్ ఎమ్మెల్యే శేర్లింగంపల్లి ఆరికెపూడి గాంధీ విచ్చేసి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరితో కలిసి చెట్లు నాటడం జరిగింది. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యము అని పెద్దలు ఊరికే అనలేదని పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని పరిసరాలు శుభ్రంగా ఉంచుకునే బాధ్యత ఇంద్రహిల్స్ కమిటీ సభ్యులు తీసుకోవడం చాలా హర్షించదగ్గ విషయమని కాలనీ ప్రెసిడెంట్ వెంకట్ ని అభినందించారు. స్వచ్ఛ ఇంద్రహిల్స్ కార్యక్రమం కేవలం చెట్లు నాటడమే కాకుండా, కాలనీ ప్రజలు బాధ్యతగా చెత్త ఎక్కడ వేయకుండా చెత్త బండి లో వేసే విధంగా అవగాహన తీసుకురావడానికి ఇంకా ఎన్నో రకాల కార్యక్రమాలు చేయబోతున్న విషయాన్ని ఎమ్మెల్యే గాంధీ ప్రశంసించారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన వారు కాలనీ ఫ్యామిలీ మెంబెర్స్ +.రామ రావు, బాలస్వామి, గొల్ల కృష్ణ,జ.బీరప్ప,ఐ.నాగేంద్ర,జష్ట్ర. రమణ ౖా.వెంకటేష్,జ ఎ కిషోర్ ,శివయ్య, సీను, విక్రమ్ మాస్టర్, బండారు శంకర్, దుబ్బ రమేష్, బెస్త రవి, ఎ.సురేష్, ప్రవీణ్,ఎ. రమేష్,జష్ట్ర. దామోదర్,కొప్పోలూ రామ రావు, నరసింహ యాదవ్, దశరథ్, గొల్ల జవఅఏఫ్వంష్ట్ర, బత్తిన చంద్ర, బాల నారాయణ, దానవత్ రవి, జమలయ్య, వెంకట్ రెడ్డి, ఖాదర్,=. కృష్ణ,దయానంద్, నరసింహ,=. నర్సింగ్ తదితరులు పాల్గొనారు

# నిరుద్యోగ యువతకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనే లక్ష్యం..

**హనుమకొండలో మెగా జాబ్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**హనుమకొండ, 19 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తోందని, ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగంలోనూ మెరుగైన ఉద్యోగ అవకాశాలు అందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ)లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగాల కోసం వచ్చిన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొత్త పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తున్నామని తెలిపారు. అర్హత, ప్రతిభ కలిగిన ప్రతి



యువకుడు, యువతి ఇలాంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం వచ్చిన యువతతో



నేరుగా మాట్లాడి వారి విద్యార్హతలు, ఆసక్తులు, ఉద్యోగ అవకాశాలపై ఆరా తీశారు. అలాగే ప్రైవేట్ రంగ సంస్థల ప్రతినిధులతో సమావేశమై స్థానిక యువతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమైన ఎమ్మెల్యే కళాశాలలోని మౌలిక వసతులు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన పనులపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యాసంస్థల బలోపేతం, యువతకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. యువత ఉద్యోగాలు పొందడమే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు విష్ణు రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు పల్లకొండ సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధ్యాపకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (వీబీఎస్ఏ) బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి'

**వరంగల్ ఎంపీ కడియం కావ్యకు ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి వినతిపత్రం**

**హనుమకొండ, 19 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (వీబీఎస్ఏ) బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్) హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్ ఎంపీ శ్రీమతి కడియం కావ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ, ప్రతిపాదిత బిల్లులోని నిబంధనలు దేశ విద్యా వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను ప్రతి ఒక్కరికీ సమాన హక్కుగా అందించే వ్యవస్థకు బదులుగా కేంద్రీకృత నియంత్రణకు దారితీసే పరిస్థితులు ఈ బిల్లుతో ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాల విద్యా విధాన నిర్ణయాధికారాలు బలహీనపడే అవకాశంతో పాటు సామాజిక న్యాయం, సమాన విద్యావకాశాలు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణ, విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. అందువల్ల ఈ బిల్లును సమగ్రంగా పునఃసమీక్షించి వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లాలని, ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించాలని ఎంపీ కడియం కావ్యను విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంపీ కడియం కావ్య ప్రతినిధుల అభిప్రాయాలను శ్రద్ధగా విన్నారు. వారు ప్రస్తావించిన అంశాలను పరిశీలించి, తగిన వేదికల్లో చర్చించేందుకు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, జిల్లా సమితి సభ్యులు కొండగట్ల అజయ్, హేమంత్, ప్రణీత్, సాయికుమార్, మహేష్, నిహాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# శేర్లింగంపల్లి బీజేపీ వెంకటేశ్వర్ నగర్ డివిజన్-248 ఓబీసీ కమిటీ ఏర్పాటు



**శేర్లింగంపల్లి (జై భీమ్ న్యూస్)**

నియోజకవర్గంలోని భారతీయ జనతా పార్టీ వెంకటేశ్వర్ నగర్ డివిజన్-248 ఓబీసీ కమిటీని డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు సిహెచ్. కృష్ణ మురళి పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్, రాష్ట్ర ఓబీసీ నాయకుడు గోవర్ధన్ చారి, మాజీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్ మాట్లాడుతూ, ఓబీసీని మరింత బలోపేతం చేసి, పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే నూతన కమిటీ సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజు, జనరల్ సెక్రటరీ వినీత్ గౌడ్, ఎం. యాదగిరి, కామరాజు యాదవ్, బీజేపీ నాయకులు ప్రశాంత్, కవిత, సంతోష్, బీజేవైఎం అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహేందర్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కుమార్ పరీక్షలు హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. జై శ్రీరామ్! జై జై శ్రీరామ్! జై ఓబీసీ! సిహెచ్. కృష్ణ మురళి పటేల్ ఓబీసీ అధ్యక్షుడు,బీజేపీ వెంకటేశ్వర్ నగర్ డివిజన్.

# నేడు జనజాగరణ యాత్రను విజయవంతం చేయండి

**జిల్లా కోశాధికారి బితి నరేందర్**

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**



సీపీస్ ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యోగులారా మన హక్కుల సాధన కోసం జరుగుతున్న టీఎస్ సిపిసిఈయు జనజాగరణ యాత్రలో ప్రతి ఒక్కరూ తప్పక పాల్గొని, ఐక్యతను చాటుదామని జిల్లా కోశాధికారి బితి నరేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు సోమవారం నాడు ఉదయం 9:10-- 9:30 వరకు పరిగి పట్టణంలోని కొడంగల్ చౌరస్తా నుండి పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట గల సర్కిల్ వరకు జనజాగరణ యాత్ర ర్యాలీ ఉంటుందన్నారు. తదుపరి సీపీఏస్ రద్దుకై,మన సమస్యల పరిష్కారం మరియు డిమాండ్స్ టీఎస్ సిపిసిఈయు సాధనపై రాష్ట్ర అధ్యక్షుల వారి ప్రసంగం ఉంటుందన్నారు. అనంతరం ఉదయం 10:10 గంటలకు పరిగి శాసన సభ్యులు క్యాంపు కార్యాలయానికి చేరి వినతిపత్రం అందజేయడం జరుగుతుందనీ, అనంతరం 10:15 గంటలకు సమావేశం అనంతరం ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఉద్యోగి, ప్రతి ఉపాధ్యాయుడు విధిగా పాల్గొని జనజాగరణ యాత్రను విజయవంతం చేయలన్నారు.

# బీసీ నేతల ఆత్మీయ సన్మాన సభలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్



**హనుమకొండ, 19 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

తెలుగు అకాడమీ చైర్మన్‌గా నియమితులైన రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటనారాయణ, మేర సహకార సంఘాల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన వెంకటరాజంలకు ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్‌లోని మాస్టర్ జీ కళాశాల ఆడిటోరియంలో ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ హాజరయ్యారు. కార్యక్రమం మాజీ ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, ఎమ్మెల్సీ సారయ్య తదితరులతో కలిసి దాస్యం వినయ్ భాస్కర్ సన్మాన గ్రహీతలను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు, బీసీ ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు నూతనంగా నియమితులైన చైర్మన్లకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు, హాజరైన ప్రజాప్రతినిధులకు బీసీ సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



## కాకతీయ వైభవం ప్రతిబింబించేలా మామునూరు విమానాశ్రయం నిర్మాణం

**డిజైన్ నమూనాలను పరిశీలించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ప్రముఖ స్థపతి డా. ఈమని శివనాగి రెడ్డితో సవివర చర్చ**



**హైదరాబాద్, 19 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు చాటిచెప్పేలా, కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచే విధంగా మామునూరు విమానాశ్రయం నిర్మాణం చేపట్టాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య ఆకాంక్షించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో భారతీయ దేవాలయ వాస్తుశిల్పం, శిల్పశాస్త్రం, వారసత్వ పరిరక్షణ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ స్థపతి, పీఈఎల్ఈసీ ఇండియా ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి డా. ఈమని శివనాగి రెడ్డితో ఎంపీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన పలు డిజైన్ నమూనాలను పరిశీలిస్తూ వాటిపై సవివరంగా చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు విమానాశ్రయం రూపకల్పనలో వరంగల్ చారిత్రక విశిష్టత, కాకతీయుల వారసత్వం స్పష్టంగా ప్రతిబింబించేలా డిజైన్ రూపొందించాలని ఎంపీ సూచించారు. ఇందుకోసం వరంగల్ చరిత్ర, నిర్మాణ శైలులు, వారసత్వ కట్టడాల ప్రత్యేకతలను సమగ్రంగా అధ్యయనం చేసి రూపకల్పన చేయాలని కోరారు. విమానాశ్రయ నిర్మాణంలో కాకతీయుల శిల్పకళా వైభవం, వాస్తు సంప్రదాయాలు, వరంగల్ చారిత్రక గుర్తింపును ప్రతిబింబించే అంశాలను పొందుపరచాలని ఎంపీ సూచించారు. దేశ విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయంలో అడుగుపెట్టిన క్షణం నుంచే వరంగల్ గొప్ప చారిత్రక, సాంస్కృతిక నగరమనే అనుభూతి కలిగేలా నిర్మాణ శైలి ఉండాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కాకతీయ కళాతోరణం, వేయి స్తంభాల ఆలయం శిల్ప వైభవం, కాకతీయుల అద్భుత కళా సంపదను ప్రతిబింబించే ఆకృతులు, నమూనాలు విమానాశ్రయ నిర్మాణంలో కనిపించేలా చూడాలని కోరారు. వరంగల్‌కు గర్వకారణంగా నిలిచే మామునూరు విమానాశ్రయం భవిష్యత్ తరాలకు కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని పరిచయం చేసే సాంస్కృతిక చిహ్నంగా రూపుదిద్దుకోవాలని ఎంపీ డా. కడియం కావ్య ఆకాంక్షించారు.

## పార్టీకి సేవే ధ్యేయంగా మూడోసారి రవీందర్ కు పదోన్నతి

**పర్వతగిరి కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియామకం**



**జై భీమ్ న్యూస్ పర్వతగిరి, జూలై 17:**

గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం నిస్వార్థంగా సేవలు అందిస్తున్న సీనియర్ నాయకుడు నరకుడు రవీందర్ ను పర్వతగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పార్టీ మూడోసారి అధిష్టానం గుర్తించింది. ఆయన నియామకంతో కార్యకర్తల్లో సంతోషం వ్యక్తమైంది. ఈ సందర్భంగా నరకుడు రవీందర్ మాట్లాడుతూ, "పదవి కంటే పార్టీకి సేవ చేయడమే నాకు ముఖ్యం. అధిష్టానం నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకెళ్తాను" అని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, ఎస్సీ వర్గాల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతానని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు జిల్లా అధ్యక్షుడు ఎం.డి. అయూబ్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, సీనియర్ నేత పిన్నింటి అనిల్ రావు లకు కాంగ్రెస్ ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఒమన్‌లో మహిళ అవస్థలు

**ఉద్యోగం పేరుతో మస్కట్‌కు వెళ్లిన హైదరాబాద్ మహిళకు చేదు అనుభవం**

**రోజుకు 15 గంటలు పని.. నాలుగు నెలలుగా జీతం లేదని ఆరోపణ**

**భారత రాయబార కార్యాలయంలో ఆశ్రయం పొందిన షబ్నమ్ బేగం**

**క్షేమంగా స్వదేశానికి రప్పించాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి**

**రిక్రూట్‌మెంట్ ఏజెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**హైదరాబాద్, జులై 19 (జై భీమ్ న్యూస్) :**

ఉద్యోగం పేరుతో ఒమన్‌కు వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. పహాడీషరీఫ్‌కు చెందిన షబ్నమ్ బేగం ఈ ఏడాది మార్చి 26న స్థానిక రిక్రూట్‌మెంట్ ఏజెంట్ ఇచ్చిన హామీ మేరకు నెలకు 200 ఒమానీ రియాల్స్ జీతంతో ఇంటి పనుల ఉద్యోగం కోసం మస్కట్‌కు వెళ్లగా, అక్కడ ఒక్క ఇంటిలో కాకుండా పలు ఇళ్లలో రోజుకు 12 నుంచి 15 గంటల పాటు పని చేయించారని, సరైన ఆహారం, వసతి కూడా కల్పించలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నాలుగు నెలలు గడిచినా ఒక్క రూపాయి జీతం కూడా ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. వేధింపులు తట్టుకోలేక అక్కడి నుంచి బయటపడిన షబ్నమ్ ప్రస్తుతం మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయంలో ఆశ్రయం పొందుతూ స్వదేశానికి తిరిగి రావాలని ఎదురుచూస్తోంది. ఆమెను క్షేమంగా హైదరాబాద్‌కు తీసుకురావాలని కుటుంబ సభ్యులు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు విజ్ఞప్తి చేయడంతో పాటు, భారత రాయబార కార్యాలయం తక్షణ సహాయం అందించాలని కోరారు. తప్పుడు హామీలతో విదేశాలకు పంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రిక్రూట్‌మెంట్ ఏజెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాగా, ఈ ఆరోపణలపై ఒమన్‌లోని యజమాని, సంబంధిత అధికారులు లేదా రిక్రూట్‌మెంట్ ఏజెంట్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు.

# "స్త్రీని చూసే చూపు మారితే.. సమాజం మారుతుంది"

స్త్రీని గౌరవించడం అంటే సమాజానికి కొత్త భవిష్యత్తును నిర్మించడం.

"ఒక స్త్రీ ఏడిస్తే అది ఒక్క ఇంటి బాధ కాదు... ఒక సమాజం తన విలువలను కోల్పోతోందనే హెచ్చరిక."

మనం 21వ శతాబ్దంలో ఉన్నామని గర్వంగా చెబుతున్నాం. సాంకేతికతలో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నాం. చంద్రుడిపై అడుగులు వేస్తున్నాం. కృత్రిమ మేధస్సును సృష్టిస్తున్నాం. ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నాం. కానీ ఒక ప్రశ్న మాత్రం మనల్ని వెంటాడుతూనే ఉంది.

"మన ఆలోచనలు కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందాయా?"

ఈ ప్రశ్నకు సమాధానం వెతకాలంటే మన ఇళ్లను, మన వీధులను, మన విద్యాసంస్థలను, మన కార్యాలయాలను, మన సామాజిక మాధ్యమాలను ఒకసారి పరిశీలించాలి.

ప్రతి రోజు ఎక్కడో ఒకచోట మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు, గృహహింస, కట్న వేధింపులు, అవమానాలు, మానసిక ఒత్తిళ్లు జరుగుతున్న వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. చట్టాలు ఉన్నా, శిక్షలు ఉన్నా, అవగాహన కార్యక్రమాలు జరిగినా ఈ పరిస్థితి పూర్తిగా మారకపోవడం మనందరికీ ఆలోచించాల్సిన విషయం.

దీనికి కారణం కేవలం చట్టాల లోపం కాదు. మన ఆలోచనా విధానంలో మార్పు నెమ్మదిగా ఉండటమే ప్రధాన కారణం.

స్త్రీ శరీరం కాదు... సంపూర్ణ వ్యక్తిత్వం

ఒక అమ్మాయి పుడుతుంది.

మొదట ఎవరికో కుమార్తె అవుతుంది.

తర్వాత ఎవరికో సోదరి.

ఆపై భార్య.

తల్లి.

అమ్మమ్మ.

కానీ ఈ పాత్రలన్నింటికంటే ముందు ఆమె ఒక మనిషి.

ఆమెకు తన కలలు ఉంటాయి.

తన అభిప్రాయాలు ఉంటాయి.

తన వ్యక్తిత్వం ఉంటుంది.

తన గౌరవం ఉంటుంది.

దురదృష్టవశాత్తూ కొన్నిసార్లు సమాజం మహిళను ఆమె ప్రతిభతో కాకుండా ఆమె రూపంతో కొలవడానికి ప్రయత్నిస్తుంది. ఈ దృక్పథమే అనేక అన్యాయాలకు మూలం.

పిల్లల పెంపకంలోనే మార్పు ప్రారంభం కావాలి

ప్రతి తల్లి తన కొడుకుకు ఒక గొప్ప విషయం నేర్పాలి.

"స్త్రీని ప్రేమించమని కాదు... ముందుగా గౌరవించమని."

ప్రతి తండ్రి తన కుమార్తెకు ఒక గొప్ప నమ్మకం ఇవ్వాలి.

"నువ్వు ఎవరికీ తక్కువ కాదు."

పాఠశాలలు మార్కులు మాత్రమే కాదు, పరస్పర గౌరవాన్ని కూడా బోధించాలి.

సినిమాలు వినోదం మాత్రమే కాదు, బాధ్యతను కూడా గుర్తు చేయాలి.

సామాజిక మాధ్యమాలు వినోద వేదికలే కాదు, విలువలను పంచే వేదికలుగా కూడా మారాలి.

పెళ్లి ఒక ఒప్పందం కాదు... పరస్పర గౌరవంతో కూడిన బంధం

మన సమాజంలో ఇప్పటికీ కొన్నిచోట్ల పెళ్లిని ఒక లావాదేవీగా చూస్తున్నారు.




కట్నం ఎంత?

బంగారం ఎంత?

ఆస్తి ఎంత?

జీతం ఎంత?

అనే ప్రశ్నలతో సంబంధాలు మొదలవుతున్నాయి.

కానీ...

ప్రేమ ఎంత?

గౌరవం ఎంత?

అర్థం చేసుకునే మనసు ఎంత?

అనే ప్రశ్నలు చాలా అరుదుగా వినిపిస్తున్నాయి.

కట్నంతో కొనుక్కునేది సౌకర్యం కావచ్చు.

కానీ ప్రేమను కొనలేం.

గౌరవాన్ని కొనలేం.

సంతోషాన్ని కొనలేం.

కోడలు ఇంటికి వచ్చిన మనిషి కాదు... కుటుంబ సభ్యురాలు

ఒక అమ్మాయి తన తల్లిదండ్రులను, తన బాల్యాన్ని, తన ఊరిని విడిచి కొత్త కుటుంబంలోకి వస్తుంది.

ఆమెకు ఆ సమయంలో అవసరమయ్యేది విమర్శలు కాదు.

ఆధారం.

ఆప్యాయత.

ఆత్మీయత.

ఒక మంచి మాట.

ఒక చిరునవ్వు.

ఒక "నువ్వు మా కుటుంబ సభ్యురాలివి" అనే భావన.

ఈ ఒక్క భావన అనేక సమస్యలను పరిష్కరిస్తుంది.

కూతురికి కట్నం కాదు... భద్రత ఇవ్వండి

పెళ్లి రోజున లక్షలు ఖర్చు చేసే తల్లిదండ్రులు...

అదే కూతురి భవిష్యత్తు కోసం పెట్టుబడి పెడితే?

ఆమె చదువులో పెట్టుబడి పెడితే?

ఆమె పేరుతో పొదుపు చేస్తే?

ఆమెకు చట్టబద్ధమైన ఆస్తి హక్కులు కల్పిస్తే?

అది జీవితాంతం ఆమెకు బలంగా నిలుస్తుంది.

పుట్టింటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉండాలి

పెళ్లి తర్వాత కూతురు తన ఇంటికి వస్తే "ఎన్ని రోజులు ఉంటావు?" అనే ప్రశ్న కాదు...

"ఇది నీ ఇల్లు... ఎప్పుడైనా రా" అనే మాట వినాలి.

పుట్టింటి ప్రేమ తగ్గిపోతే...

ఆమె జీవితంలో ఒక పెద్ద భరోసా తగ్గినట్లే.

పురుషుల పాత్ర కూడా అంతే గొప్పది

మహిళల గౌరవం కోసం మహిళలే పోరాడాల్సిన అవసరం ఉండకూడదు.

పురుషులు కూడా ముందుకు రావాలి.

స్నేహితుడు తప్పు చేస్తే ఆపాలి.

వేధింపులు చూస్తే మౌనంగా ఉండకూడదు.

గౌరవం గురించి తన పిల్లలకు నేర్పాలి.

ఇదే నిజమైన పురుషత్వం.

సమాజం మారాలంటే మనమే మారాలి

చట్టాలు అవసరం.

శిక్షలు అవసరం.

కానీ వాటికంటే ముందు మనసు మారాలి.

గౌరవం ఇంటి నుంచే మొదలవుతుంది.

తల్లి చేతిలో మొదలైన విలువలు...

తండ్రి ప్రవర్తనలో కనిపించాలి.

పిల్లల ఆలోచనల్లో పెరగాలి.

సమాజంలో సంస్కృతిగా మారాలి.

స్త్రీని గౌరవించడం ఒక రోజు చేసే కార్యక్రమం కాదు.

ఒక సందేశం పంపడం కాదు.

ఒక ప్రసంగం కాదు.

అది ప్రతి రోజు మన మాటల్లో, మన చూపులో, మన ప్రవర్తనలో, మన నిర్ణయాల్లో కనిపించాలి.

ఒక మహిళ భయపడకుండా నడవగలిగే వీధి...

గౌరవంగా జీవించగలిగే కుటుంబం...

స్వేచ్ఛగా ఎదగగలిగే సమాజం...

అదే నిజమైన అభివృద్ధి.

స్త్రీని రక్షించడం కంటే గొప్పది... ఆమెను గౌరవించడం.

స్త్రీని గౌరవించే కుటుంబం నిలుస్తుంది.

స్త్రీని గౌరవించే సమాజం ఎదుగుతుంది.

స్త్రీని గౌరవించే దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది.



## హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తేజస్విని మృతి కేసులో కొత్త కోణాలు

**దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు..**

**చెరువులో విగ్రహం కోసం డీఆర్ఎఫ్ గాలింపు**



**హైదరాబాద్, 19 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తేజస్విని మృతి కేసు దర్యాప్తులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, తేజస్విని తన దుస్తులు విప్పి సమీపంలోని ఆలయంలోకి వెళ్లి అక్కడి అమ్మవారి విగ్రహాన్ని తీసుకుని సమీప చెరువులోకి వెళ్లినట్లు సీసీటీవీ దృశ్యాలు మరియు ఇతర ఆధారాల ద్వారా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చెరువులో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. అయితే ఆమె తీసుకెళ్లినట్లు భావిస్తున్న విగ్రహం ఇంకా లభించకపోవడంతో డీఆర్ఎఫ్ బృందాలు బోట్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టాయి. దర్యాప్తులో భాగంగా తేజస్విని నివాసానికి సంబంధించిన వివరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆమె అద్దెకు ఉంటున్న ఫ్లాట్‌కు అధిక మొత్తంలో అద్దె చెల్లించినట్లు గుర్తించినట్లు సమాచారం. అలాగే ఆమె నివసించిన భవనంలోని కొన్ని అంతస్తులు నిబంధనలకు విరుద్ధంగా లాడ్జిలా నిర్వహించబడుతున్నాయా అనే అంశంపై కూడా విచారణ కొనసాగుతోంది. తేజస్విని మృతిని ప్రస్తుతం అనుమానాస్పద మరణంగా పరిగణించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె రాసినట్లు భావిస్తున్న డెత్ డిక్లరేషన్, ఇటీవలి ఆర్థిక లావాదేవీలు, సీసీటీవీ ఫుటేజీలు, కుటుంబ సభ్యులు మరియు సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను పరిశీలిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## వరల్డ్ కప్‌లో భారత్!

**ఫిఫా భవిష్యత్తుపై సీఎం రేవంత్ ఆశావహ వ్యాఖ్యలు**

**భారత్ ప్రపంచకప్ ఆడటమే కాదు.. ఆతిథ్యం కూడా ఇస్తుందని ధీమా**

**భారత జట్టులో తెలంగాణ స్టార్ ఆటగాళ్లు ఉంటారని విశ్వాసం**

**మెస్సీ హైదరాబాద్ పర్యటనను గుర్తు చేసిన సీఎం**

**ఫుట్‌బాల్ అభివృద్ధికి తెలంగాణ నుంచే కొత్త తరం వస్తుందని వ్యాఖ్య**

**హైదరాబాద్, జులై 19 (జై భీమ్ న్యూస్) :**

భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశావహ వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్స్‌లో కచ్చితంగా ఆడటమే కాకుండా, ఆ ప్రతిష్ఠాత్మక టోర్నీకి ఆతిథ్యం కూడా ఇస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా స్పందించిన సీఎం, తాను ఫుట్‌బాల్‌ను ఎంతో ఇష్టపడతానని పేర్కొంటూ, భవిష్యత్తులో భారత జాతీయ జట్టులో తెలంగాణకు చెందిన పలువురు స్టార్ ఆటగాళ్లు చోటు దక్కించుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఈ మాట గుర్తుంచుకోండి.. రాబోయే రోజుల్లో భారత సాకర్ జట్టులో తెలంగాణ యువత కీలక పాత్ర పోషిస్తుంది" అని వ్యాఖ్యానించారు. ఫిఫా వరల్డ్ కప్‌కు తన మద్దతు వెనుక స్పష్టమైన దార్శనికత ఉందని పేర్కొన్న ఆయన, గతంలో ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొచ్చి తెలంగాణ చిన్నారులతో కలిసి మైదానంలో పాల్గొనే అవకాశం కల్పించిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో ఫుట్‌బాల్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పరోక్షంగా పేర్కొంటూ, ఫుట్‌బాల్ అభిమానులందరూ ఫైనల్ మ్యాచ్‌ను ఆస్వాదించాలని ఆకాంక్షించారు.

